# బుర్రరాముడు తొవ్వకోసం



## ఆఖరి భాగం

ట్రిరుమ్ , ట్రిరుమ్ ... సైకిల్ గంట

రామక్రిష్ణ ఆగి చుశాడు. స్కూలు పిల్లవాడులా వుంది. తన దగ్గరకొచ్చి ఆగాడు. 'నేను అటే పోతున్న .. నువ్ వస్తవా?' నువ్వే సైకిల్ తొక్కాలి!' నిబంధనలతో కూడిన ఆహ్వానం విన్న రామక్రిష్ణకు నడిచిపోవాలని ఉన్నా జవాబేమీ చెప్పకుండానే సైకిల్ తీసుకొని ఎక్కాడు. వెనక క్యారియర్ మీద ఆ అబ్బాయి కూర్చున్నాడు.

'ఏమిటి ఇంత పొద్దుగాల వెనక్కి పోతున్నవ్. ఈ రోజు బడి లేదా?' తనకు తెలవకుండానే ప్రశ్నించాడు రామక్రిష్ణ.

'ఇవ్వాల ఆదివారం కదా! బడెందుకుంటుంది?' విద్యార్థి.

'అవును కదా! ఇవ్వాల ఆదివారం కాబట్టి ఊరిలో మీటింగ్ పెట్టాలనుకున్నాం కదా! పోయిన ఆదివారమే ఎంపేడు, ఎంచపెల్లి, ఓడేరు గ్రామాల పెద్ద మనుషులను కలిసి మాట్లాడినాము.

ఆ నాలుగురోజులు ఎల్లేష్, తనూ, సాంబయ్య కలిసి ఎన్ని వాస్తవాలు సేకరించాము. ప్రజలకు తెల్వకుండా ఎన్ని నిజాలు దాగి ఉన్నవి. ఆ వాస్తవాలను కప్పివుచ్చడం వలన ఎన్ని తగాదాలు. ఆ వాస్తవాలు దాచడం వల్లే కదా సూరన్న దళం, వెంకన్న దళం ఒకరిమీద ఒకరు కోపంతో పగలు పెంచుకున్నారు. ఒకరు బూర్నపల్లి సర్పంచ్‌ని వెనకేసుకొస్తె, ఇంకొకరు వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచిని వెనకేసుకొచ్చారు! ఇది రెండు గ్రామాల ప్రజలు ఒకరికొకరు శత్రువులుగా మారడానికి దారి తీసింది... ఎంత ఖచ్చితంగా ఎల్లేష్ ముందుగా ఊహించి చెప్పిండు ... "అన్నా, ఆపవా! నేను మా ఇంటికి పోయే దారొచ్చింది." ఆలోచనలు తెగి ఈ లోకంలోకి వచ్చాడు. రామక్రిష్ణ

"ఆ ... అప్పడే ఎంపేడు కొచ్చినమా?" సైకిలు దిగాడు. సరిగ్గా మాటులో ఆగాడు. మాటు ... ఎంపేడు ప్రజలు సాగుచేసుకునేందుకు నీరిచ్చే మాటు. చలి వాగుకు మాటు వేసి నీరు మళ్ళించిన మాటు కాలువ ... ఆ రోజు సూరన్న పంట కాలువను తీసి తొవ్వ చేయమని చెప్పినంక గట్టయ్య పంట కాలువను తొవ్వగా చేసినప్పుడు తమ రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించుకున్న కుంటో సెంటో కొన్నవాళ్ళంతా తమ భూమి తొవ్వ కింద పోతుంటే చాటుమాటుగా ఏడ్చారు కదా! ఇదంతా ఎల్లేష్‌కు ఎలా తెలిసింది? తమ స్కూలు టీచరుగా పని చేస్తున్నప్పటి నుండి ఏదో పరిపక్వత కనిపిస్తున్నది. ఇలా బాధ పడుతున్న వాళ్ళందరినీ రామయ్య కూడ గట్టిండనీ, వాళ్ళందరినీ 'ప్రజా ప్రతిధ్వని' దళ నాయకుని దగ్గరకు తీసుకుపోతాడని కూడా చెప్పిండే! ... నిజంగా జరిగిందదే కదా! గట్టయ్య పాత తొవ్వను దున్నించి పంట కాలువను తొవ్వగా మార్చినంక పది రోజులు గడవక ముందే వెంకన్న దళం చలి వాగులో ప్రజా కోర్టు పెట్టింది కదా! అవును ... ఇక్కడే , ఈ చలి వాగులోనే ... ఏడీ, నా ఎల్లేష్ ఏడీ? ... ఎక్కడ... ఇక్కడే ... ఇక్కడే ... వెంకన్న గట్టయ్యను హెచ్చరించిందిక్కడే ... ఇగో, రామయ్య, గట్టయ్యలు ఇటువైపు కూర్చున్నారు. నేను, ఎల్లేష్ ఇక్కడే కదా కూర్చుంది. ఇక్కడే కదా! ...

"ఆ ... రామయ్యా, రావలసిన వాళ్ళందరూ వచ్చినట్లేనా?" అని దళ నాయకుడు ప్రశ్నించింది ఇక్కడే ... ఇక్కడే ...

"ఆ, దాదాపు అందరూ వచ్చినట్టేనా" అని రామయ్య బదులివ్వగానే వెంకన్న లేచి, అంతా కలియచూసి ఉపన్యాసం ఇచ్చింది. ఇక్కడ నిలబడే కదా! ... అవును, ఇక్కడే ...

ఆ నాటి దృశ్యమంతా కనుల ముందు కదులాడుతుండగా తలపట్టుకుని మోకాళ్ళపై కూర్చున్నాడు.

"కామ్రేడ్స్ ... అందరికీ రెడ్ శాల్యూట్! మిమ్మల్ని ఈ రోజు కలువడానికి ఓ కారణముంది. మాపార్టీ గోదావరి లోయలో గత పాతిక సంవత్సరాలుగా తుపాకి పట్టి పోరాటం చేస్తున్న విషయం మీకు తెలిసిందే. వేల ఎకరాల భూమిని గిరిజనుల కోసం పంచిన పార్టీ మా పార్టీ. అలాంటి మా పార్టీ పోలీసు నిర్బంధం వలన కొన్ని ప్రాంతాలకు పోలేక పోతున్నాము. అలాంటిదే మీ ప్రాంతం కూడా. అందుకే మేము ఇక్కడికి చాలా తక్కువసార్లు వస్తున్నాము. అయినప్పటికినీ, మేము ఇక్కడికి రావడం 'జన ధ్వని' గ్రూపు దళ నాయకునికి ఇష్టం లేదని తెలుస్తున్నది. మా పార్టీని ఆదరించిన వాళ్ళకు వ్యతిరేకంగా కారు కూతలు కూసినారని తెలిసింది. మాకు దగ్గరగా వున్న కుటుంబాలపై కక్ష వూనినట్లుగా మాకు సమాచారం వుంది. బూర్నపల్లికి చెందిన గట్టయ్య సూరన్న దళంతో వుంటూ తన శత్రువులపైకి దళాన్ని ఉసిగొల్పుతున్నాడని తెలిసింది. గట్టయ్య ఇంకొక తప్పు కూడా చేశాడు. తన భూమిలో వున్న తొవ్వను దళం అండతో తీసివేయించుకొని కొత్త తొవ్వను వేయించాడు." గట్టయ్య కళ్ళలోకే చూస్తూ కొద్దిసేపు మాట్లాడడం ఆపాడు వెంకన్న. గట్టయ్య మొఖంలో రంగులు మారుతున్నాయి. నిజానికి గట్టయ్య రాగూడదని అనుకున్నాడు. కాని దళ సభ్యులు ఇంటి దాకా వచ్చి తీసుకొచ్చారు. రాక తప్పలేదు. వెంకన్న చూపుల్ని తప్పించుకునేందుకు ప్రయత్నించాడు...

" ... 'జన ధ్వని' దళం చేసిన ఈ చర్య ప్రజా వ్యతిరేకమైనది. ఎన్నో ఏళ్ళుగా ప్రజలు నడుస్తున్న ఆ తొవ్వను బందు చేయించడం ద్వారా వాళ్ళు భూస్వాముల కొమ్ము కాస్తున్నారని తేలిపోయింది. ప్రజా కోర్టు అని పెట్టి ప్రజల నోరు మూయించి తొవ్వ బందు చేయించడం పెద్ద విప్లవ చర్య కాదు. సోదర విప్లవ పార్టీ అని చూడకుండా సాయుధ రివిజనిస్టులని పేరు పెట్టి తిట్టడం వాళ్ళ అవివేకం. వాళ్ళున్న చోట ఇంకొకరుండ కూడదని తాకీదులు జారీ చేయడం భూస్వామ్య అహంకారం తప్ప వేరే కాదు. అయినా, మేము పని చేయాలనుకున్న చోట ఇంకొకరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదు. విప్లవం ఎవరి గుత్త సొమ్ము కాదు. ప్రజలున్న చోట మా పార్టీ ఉంటుంది. కావున మమ్మల్ని గుడ్డిగా ద్వేషించే సూరన్నకు చెప్పండి , తుపాకి పేల్చడం తనకంటే ముందే నేర్చుకున్నామని" కండ్లు చింత నిప్పల్లా మండుతున్నవి. వెంకన్న చూపంతా గట్టయ్య మీదనే వుంది. గట్టయ్య చూపు భూమిలో పాతుకుపోయింది.

13.9.96 ఆంధ్రజ్యోతి వారపత్రిక




"కావున. కామ్రేడ్స్! మీకు నేను ఈ ప్రజా కోర్టులో చెప్పేదేమిటంటే మీరు పాత తొవ్వలోనే నడవాలి. సూరన్న దళం చెప్పినదాన్ని ఖాతరు చేయొద్దు. "రామయ్య గట్టయ్యనే చూస్తున్నాడు. గట్టయ్య ఉలుకూ పలుకూ లేకుండా కూర్చున్నాడు.

ఎల్లేష్ లేచి నిలుచున్నాడు. "ఏమిటి, ఎల్లేష్ ఏమన్న చెబుతావా?" రామయ్య ప్రశ్నించాడు. అవునన్నట్లు తలూపాడు. వెంటనే తనేమడగాల నుకున్నాడో అడిగాడు.

"మొన్న సూరన్న వేసిన దారి వలన నష్టమేమిటి? మనకు తొవ్వ కావాలి. అంతేగాని పాత తొవ్వే కావాలని ఏముంది? కాకుంటే పాత తొవ్వ వలన గట్టయ్యతోపాటు ఇంకొక ఏడుగురు నష్ట పోతే, కొత్త తొవ్వ వలన ఇరవై అయిదు మంది నష్టపోతారు. నష్టాన్ని ఎక్కువ మందికి పంచడం సరి అయిందే గదా? అంతేగాదు. ఎన్నో ఏండ్ల నుండి పాత తొవ్వలో నడిచిండ్లు గాని దాన్ని పర్మినెంట్ దారిగా ప్రజలు వేసుకున్నారా? వర్షా కాలంలో గట్లమీద పడిపోవడం, ఎండాకాలంలో బాటగా మారడం తప్ప ఖచ్చితమయిన బాటగా ఈ ప్రజలు ఎందుకు వేసుకోలేదు? పైగా నాగలికి యాభై రూపాయలు వసూలు చేసిన సొమ్ము ఎక్కడికి పోయింది?" ఎల్లేష్ తన ప్రశ్నలు అయిపోయి తనకింక జవాబులు కావాలన్నట్లుగా చూపులు పేడుతూ కూర్చున్నాడు.

"ఎల్లేష్ ప్రశ్నలకు జవాబులు ఎవరు చెబు తారు" రామయ్యా? గట్టయ్యా?" అని వెంకన్న ప్రశ్నించాడు.

గట్టయ్యకు అనుకూలంగా అనిపించినవి ఆ ప్రశ్నలు. కావున తను జవాబు చెప్పినా తన కనుకూ లంగా చెప్పకుంటున్నట్లుంటుందని మౌనం వహిం చాడు. రామయ్య జవాబు చెప్పడానికి లేచాడు.

"ప్రజలారా! అన్నలారా! తొవ్వ గురించి మన ప్రజలు ఎన్నో ఏండ్లు పోరాడిండ్లు. సుధాకర్‌రావు దొర భూమిని పడావుగా పెట్టడం వలన మనం దాంట్లో నుండి నడవడం తేలికయింది. అయితే, రోడ్డు వేసుకుందామని నారాయణరెడ్డి దొర నాగటికి యాభై రూపాయలు వసూలు చేసిండు. మరి ఆ సొమ్ము ఏం చేసిండో వాకంటే ఎక్కువ గట్టయ్యకే తెలవాలె. ఎందుకంటే వాళ్ళిద్దరు అప్పుడు ఒక్కటిగా తిరిగారు. పాత తొవ్వ వలన నీవన్నట్లుగా ఎనిమిది మంది నష్టపోతారు. కొత్త తొవ్వ వలన ఇరవై అయిదు మంది నష్టపోతారు. అంతేగాదు. కొత్త తొవ్వ వలన ఖర్చు నాలుగు రెట్లు పెరుగుతుంది. భూమి కూడా నాలుగు రెట్లు ఎక్కువ పోతది. తక్కువ భూమిలో తక్కువ మంది నష్టపోవడం, ఖర్చు తక్కువ కావడం మంచిదా కాదా? ఖర్చు ముచ్చట పక్కకు పెడదాం. ఎన్నో ఏండ్లు పోరాడి నడిచిన తొవ్వను ఎందుకు బందు చేయాలి? నిజానికి ప్రజలు నడిచే భూమిని గట్టయ్య ఎందుకు కొనాలి? ఎందుకింత రగడ పెట్టాలి? ఇక పాత తొవ్వను ఎందుకు పకడ్బందీ చేసుకోలేదంటే, దానికి సచ్చిపోయిన నారాయణరెడ్డి కారణం. . అంతమాత్రాన, తొవ్వ బందు చేయించాలని ఏమీ లేదు. కదా?" అని కూర్చున్నాడు. రామయ్య చెప్పిన జవాబులో ఇంకా

ఈ తొవ్వ ఎంత ఘోరంగా హత్య చేసింది! ఈ తొవ్వే హత్య చేసిందా? కాదు.. కాదు! తొవ్వకోసం జరిగిన పోరాటాన్ని, ఆ పోరాటాల వెనుక దాగిన సత్యాల్ని, అసత్యాల్ని దాచిన స్వార్థపరులు నిన్ను హత్యచేశారు.

ఏదో లోపించినట్లు భావించాడు ఎల్లేష్.

"కావున కామ్రేడ్స్! మీకు తొవ్వ కావాలా వద్దా?" వెంకన్న ప్రశ్న.

"కావాలి!" కూర్చున్న వాళ్ళంతా ఒక్కసారే అరిచారు.

"మీరు పాత తొవ్వలో నడుస్తూ, కొత్త తొవ్వలో నడుస్తరా?"

అంతా మౌనం ఎవరూ మాట్లాడడం లేదు.

వెంకన్నకు కోపం ముంచుకొచ్చింది. "ఏమిటి, చెప్పండి! మీకు ఏ తొవ్వకావాలి?" గద్దించి అడిగాడు.

"పాత తొవ్వే కావాలి. కాని దాంట్లో నడిస్తే సూరన్న కాళ్ళు చేతులు నరుకుతమండ్రి." రామ నర్సయ్య వివరించాడు.

దానితో వెంకన్న ఊగిపోయాడు.

"కొత్త తొవ్వలో నడిస్తే మేము కాళ్ళు చేతులు విరగ్గొడతాం." వెంకన్న ఉక్రోషంగా అన్నాడు.

"మేము ఈ ఏరియాకు రాకూడదని సూరన్న కూతలు కూసిండట. గట్టయ్య ఏది చెబితే అది నమ్మి గట్టయ్యకు లాభం చేసింది సూరన్న దళం. అయినా దీంట్లో యింక విచారించేదేమీ లేదు. సూరన్న మాకు వ్యతిరేకంగా చెప్పిన తీర్పును మేము ఖాతరుచేయము. మీరు ఖాతరు చేయవలసిన పని లేదు. కావున మీరంతా పాత తొవ్వల్నే నడవాలి. ఇగో, గట్టయ్యా, పాత తొవ్వను ఈసారి దున్నొద్దు. ఒకవేళ దున్నితే, ఈ ప్రజా కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నడిచినట్లుగా మేమనుకుంటాం. ఒకవేళ ఈ ప్రజా తీర్పుకు వ్యతిరేకంగా నడిచిన, అది ప్రజా ద్రోహంగానే మేము భావిస్తాం." అని ముగించాడు వెంకన్న. ప్రజా కోర్టు అయిపోయినట్లుగానే భావించి అందరు లేచి నిలబడ్డారు.

"మీరంతా కొద్దిసేపాగండి. మేము వెళ్ళినంక పది నిమిషాలకు వెళ్ళండి" అని వెంకన్న సామాను సర్దుకొని బయలుదేరిండ్లు.

చెప్పవలసింది చెప్పించినట్లుగా రామయ్య మొఖం వెలిగింది. కాని గట్టయ్య మొఖం మాడిపోయింది. కొత్త బాట బందు చేయాలని వెంకన్న చెప్పడంతో తమ భూములు పోవడం లేదు కదా అనే తృప్తి అక్కడికొచ్చిన రైతుల మొఖంలో కనిపించింది. ఎల్లేష్ వెంకన్న చెప్పినదాన్ని నెమరువేసుకుంటూ, వెంకన్న వివరణలో ఎక్కడో లోపం ఉన్నట్లుగా అనుమానించాడే! రామయ్య, గట్టయ్యల ద్వేషం కొన్ని నిజాలను కనుమరుగు చేస్తున్నట్లుందని చెప్పాడే! వాటిని వెలికితీసి ఈ రెండు దళాలు ద్వేషభావంతో చేసే తీర్మానాలను ఎండగట్టాలని కూడా అన్నాడే! ఆ సభ తరువాత నన్ను జమ్మికుంటకు సాగనంపటానికి వచ్చినప్పుడు ... ఇక్కడే కదా, ఏమేమి చేయాలో అనుకున్నది! ఆ తరువాత నెల రోజులకు జమ్మికుంట కొచ్చి, పోలీసులు చాలాసార్లు వచ్చి ఎంతో భీభత్సాన్ని సృష్టించారని చెప్పి బాధపడ్డాడు గదా! రెండు గ్రామాలలో ఇండ్లన్నీ సోదాచేశారు. ఇంకొక సారొచ్చి వస్తువులన్నీ ధ్వంసంచేశారు. ఒక సారొచ్చి యువకులందరినీ ఒక చోటికి పిలిపించి చావబాదారు. కొందరిని పట్టుకపోయారు. కొందరి నుండి డబ్బులు వసూలు చేశారు. కొందరిపై కేసులు పెట్టారని ఎంత బాధపడ్డాడు. కానీ ఇంత జరుగుతున్నా, గట్టయ్య సూరన్న దళం దగ్గరికి పోయిండనీ, సూరన్న పాత తొవ్వను దున్నవలసిందేనని చెప్పినట్లుగా గట్టయ్యతో అన్నాడనీ, గట్టయ్యే ఎల్లేష్‌తో అన్నాడట. గట్టయ్య పాత తొవ్వను తవ్వించినంక కోపంతో ఊగిపోయిన వెంకన్న ఏమైనా చేసే అవకాశముందనీ మొన్న నాతో అంటివే ఎల్లేషా ... ఎక్కడ ... నీవెక్కడ .... వాగుదాటి పొలాల దగ్గరకు వచ్చాడు రామకృష్ణ.

" ...ఇగో ఎల్లేషా ... మన తొవ్వ ... ఇగో ఇదే ... మన తొవ్వ ..." గట్టయ్య భూమిలో అటు ఇటు పరుగులు తీస్తూ అరుస్తున్నాడు.

"ఈ తొవ్వ ఎంత ఘోరంగా హత్య చేసింది! ఈ తొవ్వే హత్య చేసిందా? కాదు ... కాదు! తొవ్వ కోసం జరిగిన పోరాటాన్ని, ఆ పోరాటాల వెనక దాగిన సత్యాల్ని, అసత్యాల్ని దాచిన స్వార్థపరులు నిన్ను హత్య చేశారు. ఆ స్వార్థపరులను గుడ్డిగా వెనకేసుకొచ్చిన రాజకీయాలు నిన్ను హత్య చేసినవి. ఆ రాజకీయాల్ని గుడ్డిగా ద్వేషంతో అణచివేయాలనే రాజ్యం నిన్ను హత్య చేసింది. అవును. నిన్ను హత్య చేసింది రాజ్యం ... రాజ్యమే ... ప్రజల పట్ల కనీస బాధ్యతల్ని మర్యాదల్ని పాటించని రాజ్యమే నిన్ను హత్య చేసింది ... రాజకీయ ద్వేషాలతో ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని చూపే గుడ్డి న్యాయం నిన్ను బలిగొంది... అవును... ఈ తొవ్వ ఈ గ్రామాలకు ఎంత ముఖ్యమో, ఈ ప్రజల మధ్య ఐక్యత కూడా అంతే ముఖ్యం ... కాని జరిగిందేమిటి? తొవ్వ ఇటు వేయాలా? అటు వేయాలా? అసలు నీవెక్కడ ...? ఎక్కడ ? ఎల్లేషా ... ఎక్కడ ...? ఏడి, నా ఎల్లేషా ఏడి? ఏ తొవ్వలో వున్నాడు? ఎక్కడ నా ఎల్లేష? ... అంటూ వూళ్ళోకి పరుగుతీశాడు.

ఊరంతా నిశ్శబ్దం. నిర్మానుష్యం. రామక్రిష్ణ ఏడుస్తూ అలాగే ఊరు మొదట్లోకి పరుగు తీశాడు. రెండు గ్రామాల ప్రజలంతా నిన్న ఎల్లేషను కొట్టి చంపిన చోటనే వున్నారు. అందరు గుంపులు గుంపులుగా నిలబడి విషాదంతో పోలీసుల కిరాతకంపై మాట్లాడుకుంటున్నారు. "ఎల్లేషా... ఎల్లేషా" అంటూ అకస్మాత్తుగా ఏడుపు వినపడిన దిక్కుకు జనం చూపుమళ్ళింది. రామక్రిష్ణ అటూ ఇటూ ఉరుకతూనే ఏడి నా ఎల్లేష, ఏడి? అని అరిచి కుప్పకూలాడు. అందరు అతని చుట్టూ మూగారు. ఎవరో నీళ్ళ కోసం అరిచారు. ఎవరో అందించారు. నీళ్ళు చల్లి కూర్చోబెట్టారు. రామక్రిష్ణ కళ్ళు తెరిచి, ఎక్కడ...వాళ్ళెక్కడ? అవ్వెక్కడ? అని ఏడుస్తూ అడిగాడు. అవ్వ ఎక్కడ అనే ప్రశ్నకు జవాబు అందరికీ తెలిసిందే. ఎల్లేష్ తల్లి తండ్రులు కూర్చున్న చోటుకు తీసుకెళ్ళారు. "అవ్వా!" అని అరిచి వాళ్ళపై పడ్డాడు. "నా ఎల్లేష్ ఎక్కడనే, అవ్వా! నా ప్రాణం ఎక్కడనే ఓ అయ్యా!...నేనొక

ఆదివారం ఆంధ్రజ్యోతి 13.9.96

గంటసేపు ఉంచుకుంటే వా ఎల్లేష బతుకువే అయ్యా!..." "నా ఎల్లేషను పొట్టన పెట్టుకున్నదెవరే, అవ్వా?" చుట్టూ మూగిన వాళ్ళు కొందరు రామయ్య మొఖం చూస్తే, కొందరు గట్టయ్య మొఖం చూశారు. వ్లాళ్ళిద్దరు ఆ చూపులు భరించలేక మొఖం చాటుచేసుకొని వెనక్కిపోయారు. రామక్రిష్ణను ఓదార్చాలని వాళ్ళిద్దరికీ వున్నా, సాహసించలేకపోయారు. అందరూ రామక్రిష్ణ చుట్టూ మూగారు. ఆడవాళ్ళు పోలీసులను తిడ్తాండ్లు. మొగవాళ్ళు ఆ సాహసం కూడా చేయలేకపోతున్నారు. ఎల్లేష్ తల్లితండ్రులు "ఏడ్చి ఏడ్చి నీరసించిపోయారు. వారిలో ఏడ్చేశక్తి కూడా కరువైంది. రామక్రిష్ణపై తలవాల్చి మౌనంగా రోదిస్తున్నారు.

"బిడ్డలిద్దరు చిన్నప్పటి నుండి ఒక్కటిగా తిరిగిండ్లు". "అన్నదమ్ములు కూడా గట్లుండరు"

"ఎవ్వడింటికి పోయేవారేమోగానీ, ఎవ్వడు కంట్ల బడినా ఇద్దరు కలిసే కంట్ల బడేటోల్లు


ఇలా చుట్టూ కూడిన ఆడవాళ్ళు తలో తీరుగా రామక్రిష్ణ, ఎల్లేషల సంబంధాన్ని వ్యాఖ్యానిస్తున్నారు. ఇవన్నీ చెవులోబడి ఇంకా ఉద్వేగానికి గురైనాడు. రామక్రిష్ణ మెల్లిగా లేచి నిలబడ్డాడు. ఒక్కొక్కరిని చూస్తూ "ఎక్కడవ్వా, నా ఎల్లేష, ఎక్కడ! నా ఎల్లేషను ఎవరు చంపిండ్లే? మీరంతా లేరా తల్లి? ఒక్కరన్నా నా ఎల్లేషను కాపాడలేదా?" అని వారిని చూస్తూ ప్రశ్నించాడు.

"మమ్మల్ని పోలీసోల్లు బైటికి రానివ్వలేదు బిడ్డా! ఊరి మొగాళ్ళందరూ చూస్తుండగానే చంపిండ్లు బిడ్డా?" ఓ తల్లి సంజాయిషీ నిచ్చింది. దానితో రామక్రిష్ణ ఆలోచనా పొరల్లో దాగిన కోపం బద్దలైంది. "ఊరి మొగాళ్ళు చూస్తుండగానే కొట్టి చంపిండ్లు! మరి వాళ్ళు మనుషులెట్లవుతురు తల్లి? ఒక్క ఎల్లేషను పట్టుకొని అందరి ముందు హింసలు పెట్టి చంపుతుంటే గారడి ఆట చూస్తున్నట్లు చూసారా?" చుట్టూ ఉన్నవాళ్ళు తలలు సిగ్గుతో వంగిపోయినవి.

"ఏమండీ రామయ్య గట్టయ్య మీకు ఊర్లోని పదవులు కావాలి, పెత్తనం కావాలి. దాని కాపాడుకోడానికి ప్రజల్ని చీల్చి వేస్తారు. ఘర్షణ పెడతారు. మరి ఒక నిజాయితీపరుణ్ణి, ఒక అమాయకుణ్ణి చట్టాన్ని కాపాడవలసిన పోలీసులే రాక్షసులుగా చంపుతుంటే మీరేమో చూస్తూవుంటారు. ఇంక మీరెందుకు? మీకు పదవులెందుకు? ఇంతమంది చదువుకున్నవాల్లున్నారే పంతుల్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, మీరంతా చూస్తుండగా పోలీసులు ఒకరి ప్రాణం తీస్తే, మీ చదువెందుకు? మీకెందుకు గౌరవం, విలువ ఇవ్వాలి? చెప్పండి! మీరు మేధావులుగా ఎన్నో ప్రత్యేక సదుపాయాలు డిమాండ్ చేస్తారు గదా! మీ ముందే ఒకరి ప్రాణాల్ని బలిగొంటున్న పోలీసుల్ని ప్రశ్నించకుంటే మీరేం మేధావులు? మీ కెందుకు ప్రత్యేకతలు?...ఏం చంద్రయ్య మామ, రామనర్సయ్య మామలు, మీరంతా హక్కుల గురించి మాట్లాడతారు గదా! మరి పోలీసువాడికి ఒకరి ప్రాణం తీసే హక్కును మీరెందుకు ఇచ్చారు? ఇంత మందిలో ఒకరో, ఇద్దరో మాట్లాడినా వాళ్ళెంబడి మిగతావారు వచ్చుగదా! ఎందుకు మాట్లాడలేదు? మనలో గూడు కట్టుకున్న సంస్కృతి మాట్లాడనివ్వలేదా? చెప్పండి!..చెప్పండి!..."

అందరూ మౌనంగా చూస్తున్నారేగాని మాట్లాడడానికి సాహసించలేదు. "ఏం గట్టయ్యా, నీ భూమి పోతోంది కాబట్టి నీకు నక్సలైట్లు కావల్సివచ్చింది. వాళ్ళ కోసం వెళ్ళి వాళ్ళకు ఏదో చెప్పి తెప్పించుకున్నావు. మరి ఒకరి ప్రాణం తీస్తుంటే కనీసం అడ్డం ఎందుకు పోలేదు? నీ భూమి కన్నా ఎల్లేష్ ప్రాణం హీనమయిందా? ఎన్నో ఏండ్ల నుండి ఉన్న తొవ్వను రద్దుచేయడానికి నీకు నక్సలైట్లు కావల్సివచ్చింది...." ఆగి రామయ్యవైపు చూస్తూ, "ఏం, రామయ్యగారు, మీరు తొవ్వ కోసం నక్సలైట్లను పిలిపించుకున్నామంటారు. నిజానికి, ఊరి తొవ్వ నీకు దొరికిన సాకు మాత్రమే. గట్టయ్యకు, నీకు ఉన్న రాజకీయ శత్రుత్వంలో ఈ తొవ్వను ఉపయోగించుకున్నారు. గట్టయ్య తొవ్వను మూసేయడానికి సూరన్న దళాన్ని తెచ్చుకుంటే, దాన్ని తెరిపించడానికని వాళ్ళ రాజకీయ శత్రువైన వెంకన్న దళాన్ని నీవు రప్పించుకున్నావు. ఇంతా చేసి ఎవరికి వాళ్ళు తమ పంథాయే కరెక్టనుకొనే ఆ నక్సలైట్లు పూర్తిగా, లోతుగా విచారించారా? లేదు. పైపై పరిశీలనలతో తమకు ఆశ్రయమిచ్చిన వారి కోరికల్ని తీర్చాలనుకున్నారేగాని లోతుల్లోకి వెళ్ళలేదు. సమస్య పరిష్కారానికి తమ ద్వేషాన్ని ఆధారం చేసుకున్నారు. కాదంటారా! చెప్పండి... చెప్పండి..." ఆగాడు.

"గట్టయ్యగారు మీరు సుధాకర్‌రావు దగ్గర నుండి భూమిని కొన్నప్పుడు తొవ్వ క్రింద పోయే భూమి అంటే దాదావు 20 గుంటలు విడిచిపెట్టే కొన్నది నిజమా! అబద్ధమా!"



రామక్రిష్ణ వేసిన ఈ ప్రశ్నతో గట్టయ్య మొహం పాలిపోయింది. కళ్ళెత్తి చూడడాన్కి వణికిపోయాడు. అప్పటివరకు విషాదంతో మునిగిపోయిన ఆ ప్రదేశమంతా రామక్రిష్ణ ప్రశ్నలతో అందరి ముఖాల్లో కదలిక ప్రారంభమైంది.

"మీరు ఈ వాస్తవాల్ని సూరన్న దళంకు తెలియనీయకుండా జాగ్రత్త పడ్డారు. వాళ్ళ శత్రువుని చూపి నీ స్వార్థాన్ని కాపాడుకోవాలనుకున్నావు. ప్రతి సమస్యకు చారిత్రక పరిస్థితులు కారణమని విశ్వసించే వారికే నీవు సమస్య పూర్వాపర్వాలు తెల్వకుండా జాగ్రత్తపడ్డావు."

రామయ్య మీరైనా గట్టయ్య సుధాకర్‌రావుతో చేసుకున్న కొనుగోలు ఒప్పందాల వివరాలు సేకరించి వెంకన్న దళానికి చెప్పావా? లేదు, ఎంతసేవు నీ ప్రత్యర్థిపై దెబ్బతీయలనే ఆలోచన తప్ప తొవ్వకున్న విశిష్ట వాస్తవ అంశాలను సేకరించి వాల్లకు చెప్పలేదు. మరి వాల్లైనా తొవ్వకోసం వడిచిన చరిత్రను లోతుగా త్రవ్వి చూడకుండానే నీ కోరిక తీర్చడానికి గట్టయ్యపై హెచ్చరికలు పొలం తొక్కించడం జరిగింది. ఫలితం ఏమిటి?

ప్రజలంటే మర్యాద ఇవ్వలేని, చట్టం అంటే కనీస గౌరవం చూపని చట్టరక్షకుల నిలయం మన సంఘం. వాల్లు తొవ్వకోసం జరిగే ఈ తొక్కిసలాటను ఆసరా చేసుకొని ప్రజల్ని వేధించారేగాని పరిష్కరించలేదు. నక్సలైట్లు ఊల్లకు రావద్దంటారు. ప్రజలు వారికి తిండి పెట్టొద్దంటారుకాని ప్రజల సమస్యను కనీసం ఆలకించరు. నిజాయితీగా ప్రజలపట్ల నడుచుకోరు. ఈ ఊల్లకు నక్సలైట్లు "తొవ్వ కోసం" వస్తారు కదా! మరి ఆ తొవ్వ గురించి వాల్లేమయినా పట్టించుకున్నారా? లేదు...వాల్లకు పట్టించుకోవాలనే కనీస ఇంగితం కూడా వుండదు. కాని ఊల్లకు నక్సలైట్లు వస్తున్నారని, దానికి ఆ ఊళ్ళ ప్రజలే కారణమని వాల్లను హింసించడం, దోచుకోవడం, కేసులు పెట్టడం, ఎన్‌కౌంటర్ పేరుమీద కాల్చిచంపడం మాత్రం చేస్తారు. ఇవ్వుడు చేసింది అదే....అదే... నా ఎల్లేష్ని పొట్టన పెట్టుకుంది ఇదే.

మనం, మనమంతా సమస్యను సర్పంచ్‌లకు విడిచిపెడితే ఇగో రెండు గ్రామాలను విడదీసారు. అన్నలు గయునికి అర్జునుడు ఆశ్రయమిచ్చినట్లుగా వీల్లకు రక్షణ ఇచ్చారు. ఏదొచ్చినా వాల్లే చేసిపెడతారులే అనే ధోరణి నా ఎల్లేష్ను మీ అందరిముందు కొట్టి చంపుతుంటే చూస్తూ నిలబడ్డారే కాని ఒక్కరు కూడా కదలలేదే....నా ఎల్లేష్ను సంపకుండా ఆపలేదే...మీరంతా పోలీసుల్ని అడ్డుకుంటే నా ఎల్లేష్ బతికే వాడు కాదా?! చెప్పండి... చెప్పండి... అంటూ చుట్టూ చూస్తూ నిలబడ్డ జనాన్ని చూస్తూ ప్రశ్నిస్తూ...దాహంతో తడారిన గొంతును పట్టుకొని.... వొరిగిపోయాడు....



- సమాప్తం